

ప్రభుత్వాలను కదిలించేలా పోరాటం

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వాలను కదిలించే పోరాటాలు చేసినప్పుడే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. శుక్రవారం జెబిలీలో నిర్వహించిన సిఐటియు మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నాయని, కార్మికులు బలమైన పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగి రావన్నారు. కనీస వేతనం రూ.26,000వేలు ఇచ్చేంత వరకు పోరాటం చేయాలన్నారు. అనంతరం సిఐటియు మండల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా అప్పలనరస, సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా చంటిబాబు, కే.లక్ష్మి, జి.వెంకటలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అప్పలంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మహిళలపై జరుగు తున్న హింసలను అరికట్టి హింస లేని సమాజాన్ని సృష్టిద్దామని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ పిలుపునిచ్చారు. హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని దండకారణ్య కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 25 నుండి డిసెంబర్ 10 మానవహక్కుల దినోత్సవం వరకు 16 రోజుల పాటు హింసను అరికట్టి హింస లేని సమాజాన్ని సృష్టిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. దీని అరికట్టడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం చెందుతున్నామని తెలిపారు. ఆడపిల్లలకు విద్య, ఉద్యోగంలో సమాన వేతనాలు, సమానత్వం, మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, మగవారితో పాటు సమాన అవకాశాలు కల్పించకపోవడంతో అణిచివేతలకు గురై ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు మాట్లాడుతూ, మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వెబ్ సైట్లు, సినిమాలు మహిళలపై హింసను ప్రేరేపించేవిగా ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చలపతి, కాలేజ్ చైర్మన్ బి.రాజారావు, వార్డు సభ్యులు అప్పలమ్మ, దండకారణ్య ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు ప్రసాద్, నరేష్, సన్యాసమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు అరికట్టాలి: హైమావతి

హుకుంపేట: మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని మహిళ సంఘం(ఐద్వా) జిల్లా నాయకురాలు సొంటేన హైమావతి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఐద్వా 75 ఏళ్ల వజ్రోత్సవాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ, ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒక మహిళ ప్రపంచంలో హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యలు, అత్యాచారాలు, గృహ హింసలు దేశం, రాష్ట్రంలో రోజు, రోజుకు పెరుగుతున్నాయన్నారు. హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. మహిళలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా సమాన అవకాశాలు కల్పించినప్పుడే హింసను అరికట్టడం సాధ్యమన్నారు. మహిళా సంఘం చేసిన అనేక పోరాటాల ఫలితంగా పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ లలో రిజర్వేషన్లను సాధించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు,కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహా చలం నాయుడు, మెరకచింత మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, మహిళ పోలీస్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కిరణ్ పాల్గొన్నారు.

హింస లేని సమాజానికై ఉద్యమించాలి

ర్యాలీలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ

ప్రజాశక్తి ఎటపాక: హింస లేని సమాజ నిర్మాణానికి ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ.పద్మ పిలుపునిచ్చారు. ప్రపంచ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుండాల కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య వరంగా వివక్షకు గురవుతుందన్నారు. గృహహింస, స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా నవంబర్ 25న స్త్రీ హక్కుల పరిరక్షణ, హింస వ్యతిరేక దినంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించిందని తెలిపారు. మహిళలపై హింస, దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు టి.వెంకటరమణ, పి.పద్మ, ఐ.జయ, టి.రమణ, టి.జ్యోతి, విజయ, దివ్యవాణి, శిరీష పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ఐద్వా నాయకులు



గిరిజన సంఘం మండల మహాసభలో మాట్లాడుతున్న లోతా రామారావు

గిరిజన హక్కులు, చట్టాల అమలుకు పోరాటాలు

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల హక్కులు, చట్టాలను పట్టిష్ట అమలు చేసేందుకు ఆదివాసీలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద గిరిజన సంఘం మండల 5వ మహాసభ సంఘం నాయకులు కాళ్ల రాజబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో ఉన్న వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు గిరిజనుల హక్కులు, చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాల్లో గిరిజనులకు 100శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నెంబర్ 3ని తక్షణం పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు శామ్యూల్ కమిటీని ఏర్పాటు చేసిందని, తక్షణమే ఇందుకు సంబంధించిన జిఒ 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులు రాష్ట్రంలో 40 లక్షలు మంది, బెంతు ఒరియాలు 15 లక్షలు మంది ఉన్నారని వీరిని ఎస్టి జాబితాలో కలపడం వల్ల గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. జీవో 52ను రద్దు చేయకుంటే ఆదివాసీ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

గిరిజన సంఘం మండల కమిటీ ఎన్నిక

అనంతరం గిరిజన సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు, ఉపాధ్యక్షులుగా పాండవుల సత్యనారాయణ, జర్త లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా జర్త రాజుబాబు, ట్రెజరర్‌గా గూడెం మల్లికార్జునరావు, మరో ఎనిమిది మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం సూరిబాబు

రంగురాళ్ల క్వారీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-అడ్డతీగల

మండలంలోని మల్లవరం మామిళ్ల రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ఏరియాలో తపస్సు కొండ ఏరియాలో గ్యాస్ క్వారీ వద్ద అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు సాగుతుండగా పోలీసులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుప్పులపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ధాన్యం పాలెం, కళ్ళు మామిడి గ్రామాలకు చెందినవారు పారిపోయారు. వారిపై దృష్టి సారించి ఆయా గ్రామాల్లో వెతుకుతున్నట్లుగా ఎస్సై అప్పలరాజు తెలిపారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత : పిఒ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరిత గతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ స్పష్టం చేసారు. జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్ఒ బి. దయానిధితో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి శుక్రవారం స్పందనలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు ప్రతి శుక్రవారం నిర్దిష్టమైన సమయానికి స్పందనకు హాజరు కావాలన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడింది కాబట్టి అభివృద్ధిపై అంచనాలు ఎక్కువగా ఉంటాయని గిరిజనుల ఆకాంక్షల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. స్పందన సమస్యలు పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో డివిజన్ పరిధిలో రోజుకి 55 వేల మందికి పని కల్పించాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా జల్ జీవన్ మిషన్ లో మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలన్నారు.

స్పందనలో 95 ఫిర్యాదులు

స్పందనలో 95 ఫిర్యాదలును స్వీకరించారు. హుకుంపేట మండలం గన్నేరుపుట్టు సర్పంచ్ ఎస్.కృష్ణారావు మదుము గ్రామానికి మినీ అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ తులబడ గ్రామస్తులు కె.శంకరరావు, వి.చంద్రమ్మ తదితరులు కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని కోరారు. కొయ్యూరు మండలం మూలపేట, కుమ్మర్ల, జాజులబంధ, ధారగెడ్డ, పాలమామిడి, హర్లుబంద గ్రామాలకు మెటల్ రోడ్డు మంజూరు చేయాలని జెడ్ పిటిసి వారా సూకరాజు, కె.చిట్టిబాబు వినతిపత్రం అందజేసారు. కొయ్యూరు మండలం గొట్టెలపాడు వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది మంజూరు చేసారని, నిర్మాణం చేపట్టాలని డి.రమేష్ వినతి పత్రం సమర్పించారు. చింతూరుకు చెందిన భరణి వికలాంగుల పింఛను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, ఎపిఒ వివిఎస్ ప్రభాకరరావు, ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, డిఎల్ పిఒ పివిఎస్ కుమార్, ఆర్ అండ్ బి ఇఇ బాలసుందర బాబు, పిఆర్ ఇఇ కొండయ్యపడాల్, జిసిసి డిఎం కె.పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

పాడేరు టౌన్: పెట్రోల్ బంకుల్లో సర్వీసు ప్రొవైడర్ల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 26వ తేదీ వరకు పొడిగించామని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కొంత మంది గిరిజన అభ్యర్థుల అభ్యర్ధన మేరకు గడువు పొడిగించామని చెప్పారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐటిడిఎ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న పిఒ, అధికారులు



నిరసన చేపడుతున్న కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: సమస్యల పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా పాడేరు ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్‌డబ్ల్యూఎఫ్ ఏపీ ఆర్టీసీ పాడేరు డిపో కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ, 2017 పే ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, ఓటి అలవెన్స్, డే అవుట్ అలవెన్స్ ఏ నెలకు ఆ నెల అందించాలని, ఆర్టీసీలో అద్దె బస్సులు వద్దని సంస్థ ద్వారా బస్సులు కొనుగోలు చేయాలని తెలిపారు. పాత పద్ధతిలోనే ఆర్టీసీలో వైద్య సౌకర్యం అమలు చేసి, ప్రమోషన్ తీసుకున్న 2096 మంది ఉద్యోగులకు కొత్త పే స్కేల్ వెంటనే అమలు చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్సులు, 2017 నుంచి 2022 వరకు లీవ్ ఎన్ క్యాష్ మెంట్ చెల్లించాలని కోరారు. విద్యుత్ బస్సులు నేరుగానే ఆర్టీసీకే కేటాయించాలని, ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, ప్రభు, వరహాలు, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే పాఠశాల పున:ప్రారంభం

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని చిలకగెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామంలో పాఠశాలను తిరిగి పున:ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పోరాటం ఫలితంగా గిరిజన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందుతుండటంపై సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఆనంద వ్యక్తం చేశారు. పాఠశాల తిరిగి ప్రారంభం అనంతరం సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధనలపై అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం వంకాయపాలెం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం కొన్ని ఏళ్ల తర్వాత అక్కడ పాఠశాల మూసివేసి కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు అప్పటి ప్రభుత్వం విలీనం చేసిందని తెలిపారు. దీంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 30 మందిపైన విద్యార్థులు గ్రామం నుండి రాకపోకలు సాగిస్తూ చదువులు కొనసాగించడంలో ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాఠశాలను తిరిగి మంజూరు చేశారన్నారు. పోరాట ఫలితంగా విద్యాశాఖ అధికారులు గ్రామంలో మూడు నెలల కిందట వచ్చి పరిశీలించి గ్రామసభ అనుమతులతతో చిలకగెడ్డ పాఠశాలలో బోధనను అందిస్తున్నందుకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో మొస్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



బోధిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

పగిలిన తాగునీటి పైపులైన్లు

- నీరు లీకై చెరువుల్లా మారిన అంతర్గత రహదారులు
- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టరు నిర్వాకంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



చింతూరు బిసి కాలనీలో చెరువును తలపించేలా ఉన్న అంతర్గత రహదారి

ప్రజాశక్తి-చింతూరు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఉంది చింతూరు మండల కేంద్రంలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు. జల్ జీవన్ మిషన్ పథకం కింద చింతూరులో కొత్తగా తాగునీటి పైపులైన్లు వేసే క్రమంలో కాంట్రాక్టరు విచక్షణ రహితంగా ప్రొక్లెయినర్‌తో తవ్వేయడంతో ఇప్పటికే ఉన్న పాత తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయి. కొత్త పైపులైన్లు వేసే క్రమంలో పగిలిన పైపులైన్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గుత్తేదారుడు అవేవీ చేయకుండానే కొత్త పైపులైన్లు వేసి తవ్విన కాలువలను పూడ్చివేశారు. దీంతో పైపులైన్లు పగిలిన చోట తాగునీరు లీకై రోడ్లపైకి వచ్చింది చేరింది. దీనికి తోడు కొత్త పైపులైన్లు వేయడానికి కాలువలు తవ్వే క్రమంలో రోడ్లు శిథిలమయ్యాయి. ఇప్పుడు ఆ నీరు చేరడంతో రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో అంతర్గత రహదారులు బురదమయంగా మారి ప్రజలు నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. అసలే సరైన రహదారులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే, పైపులైన్లు పగలగొట్టి ఉన్న రహదారులను కాస్త బురదమయం చేయడంతో మండల కేంద్రంలోని బీసీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద తవ్విన కాలువల్లో మట్టి సమాంతరంగా పూడ్చకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు గోతులను దాటుకుంటూ వెళ్లే క్రమంలో కుదుపులకు గురికావడంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సదరు గుత్తేదారునికి సరైన సూచనలు ఇవ్వకపోవడంతో ఇష్టానుసారంగా తవ్వేసి, తిరిగి మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. నివాసాల ముందు పైపులైన్ల బురద నీరు ఉండటంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పగిలిన పైపులైన్లకు మరమ్మతులు చేయాలని, తవ్విన కాలువలను పూర్తిస్థాయిలో పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు కిరణ్, వెంకట్

ప్రజాశక్తి - రంపచోడవరం

సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్స్ ప్రాజెక్టులో 5 మండలాల్లో పనిచేస్తున్న 145 గ్రామాల పరిధిలో కార్మికులకు బకాయి ఉన్న 10 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సత్యసాయి వాటర్ స్కీం వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 2వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్ష శిబిరాన్ని కిరణ్, వెంకట్ సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి వాటర్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేయాలని, తాము అండగా ఉంటామని చెప్పారు. ఉన్నతాధికారులు దిగొచ్చి పది నెలల వేతనాలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులు నిరుత్సాహ పడకుండా పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, తీగల శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

అటవీశాఖ అధికారి హత్యకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు

తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ప్రాంతంలో అటవీశాఖ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు హత్యకు వ్యతిరేకంగా శుక్రవారం అటవీశాఖ సిబ్బంది ఖాకీ యూనిఫారం ధరించి మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ఐటిడిఎ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. 'జోహార్ శ్రీనివాసరావు', అక్రమార్కుల అడ్డగింపులో అసువులు బాసిన శ్రీనివాస్ అమర్ రహే అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అడవులను కాపాడేందుకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న తమకు ప్రాణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో చింతూరు అటవీ శాఖ సిబ్బందిపై కూడా అనేక దాడులు జరిగాయని గుర్తు చేశారు. ఆత్మస్థైర్యంతో పనిచేస్తున్న అటవీశాఖ సిబ్బందిని ప్రభుత్వం బాధ్యతాయుతంగా కాపాడే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు, డీఎఫ్ఓ సాయిబాబాకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ స్థాయి అటవీ శాఖ సిబ్బంది మోహన్, విజయలక్ష్మి, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎంపిటిసి

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని ముసురిమిల్లి ఆశ్రమ పాఠశాలను ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం శుక్రవారం సందర్శించారు. తరగతులకు వెళ్లి లెక్కలు బోర్డుపై రాసి పిల్లలతో చేయించారు. పిలలతో కలిసి భోజనం చేశారు. అనంతరం గదులు, బాత్రూమ్‌లు పరిశీలించారు. అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే ఎఎన్ఎంకు, వార్డెన్‌కు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. రాత్రిపూట స్టడీ అవర్ పెట్టి 10 తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసు రమేష్ బాబు, వార్డ్ మెంబెర్లు విక సత్యనారాయణ, బోబ్బా సత్యనారాయణ, వైసిపి నాయకులు బోబ్బా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఈనెల 26, 27 తేదీలలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుమూడి విక్టర్ ప్రసాద్ పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న చీపురుపల్లి నుండి బయలుదేరి రాత్రి 9 గంటలకు అరకు వ్యాలీ చేరుకుంటారని, 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానికంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు అరకు వ్యాలీ నుంచి బయలుదేరి మచిలీపట్నం వెళతారని తెలిపారు.

లబ్ధిదారులకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరుటౌన్: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం ఆర్థిక స్వాలంబన సాధించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ సూచించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్ మెంట్ హామీ ప్రోగ్రాం కింద ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల 56 వేల 500 రుణాలను శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో పంపిణీ చేసారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్ఒ బి.దయానిధి, పిడి మురళి, ఎల్ డిఎం రవితేజ, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పాడేరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న శనివారం పాడేరు పాత బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆదివాసి అదికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నర్స తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

30న వాహనాల వేలంపాట

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈనెల 30న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఏ.గణపతిబాబు శుక్రవారం స్థానిక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి కలిగిన వారు ఈ క్రింది నెంబర్లను: 9440902393, 6281322458, 8500455420 సంప్రదించాలని కోరారు.

మన్యాన్ని కమ్మిన పొగ మంచు

ప్రజాశక్తి- అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో దట్టమైన పొగ మంచు కమ్మేసింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ఘాట్ రోడ్ కొండల్లో పొగ మంచు కమ్మేయడమే కాకుండా అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. దీంతో, అనంతగిరి, అరకు ఘాట్ రోడ్ ప్రయాణించే వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లారు. పంటల కోతలు, నూర్పులు సమయంలో చిరు జల్లులతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షాలు కురిస్తే తమ చేతికి వచ్చిన పంటలు నష్టపోతామని ఆందోనళ చెందుతున్నారు

ఆటో స్టాండ్ ఏర్పాటు



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని అరకు సంత బయలు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కొర్రాయి, కొల్లాపుట్టు నూతన ఆటో స్టాండ్‌ను స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ పి.కొములు, రామ్మూర్తిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆటో వాహనదారులు నడపాలని సూచించారు. రోడ్డు ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు ఆటోల ప్రధాన రవాణా సౌకర్యం అన్నారు. ఆటో వాహనదారులు బాధ్యతాయుతంగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చే విధంగా ఉండాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

పోడు భూములకు పట్టాలివ్వాలి

- సిపిఎం జిల్లా నాయకులు సత్యనారాయణ


ప్రజాశక్తి - కూనవరం : గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వం తక్షణమే పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య అధ్యక్షతన సిపిఎం విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా, గోతులు పడి ఉన్నాయని, వాటి మరమ్మతులు చేయాలని కోరారు. మంచి నీరు అందించే విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ, బొర్రయ్య, రాధ, జ్యోతి, తమ్మయ్య, శ్రీనివాసరావు, సుబ్బయ్య, బాబు, సర్పంచులు ఎంపీటీసీలు డి.రమాదేవి, కె.నాగమణి, బి.వెంకమ్మ శంకర్ ఈశ్వర్ రాజు, జోగయ్య బొజ్జి, బాబూరావు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తవీధిని సందర్శించిన విద్యుత్‌శాఖ అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి బి.కొత్తవీధిలోని విద్యుత్ సమస్యలపై స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని బి.కొత్తవీధి, సూరులపాలెం, సల్లిగెడ్డ, తుములోవ గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించాలని, గతంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్‌కు సంబంధించి కరెంట్ తీగలు పూర్తిగా పాడయ్యాయని, కొత్తగా ఏర్పాటు చేయాలని, కొత్తపల్లి గ్రామానికి స్తంభాలు వేసి, డిటిలాక్ వేయకుండా, కరెంట్ తీగలు లాగకుండా వదిలేశారని విద్యుత్‌శాఖ డిఇ దృష్టికి తీసుకొచ్చారు. గత సంవత్సరం పంచాయతీ పరిధిలోని దొడుకొయ్యి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎసి పవర్ లైన్ బెట్ పుట్ ఇంకా సరఫరా చేయలేదని తెలిపారు. దీనికి డిఇ, ఎడి, ఎఇ స్పందిస్తూ పై సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంజీవ్, వాలంటీర్లు, పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు శేషయ్య మృతి

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని సున్నపుగూడెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు, మాజీ శాఖ కార్యదర్శి సున్నం శేషయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంత సత్తిబాబు శేషయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. వరదల వల్ల వివిధ అనారోగ్య సమస్యలకు గురై మృతి చెందిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.



నివాళ్లర్పిస్తున్న సిపిఎం నేతలు

మహిళల రక్షణ సమాజ బాధ్యత



పాడేరులో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ



రంపచోడవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - పాడేరు టౌన్: మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని టిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ తెలిపారు. మహిళా చట్టాలపై స్త్రీలకు అవగాహన ఉండాలని చెప్పారు. శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కాఫీ హౌస్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్త్రీలపై హింస నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహనా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కుటుంబంలోనే బాలికలు, బాలుర పట్ల వ్యత్యాసాలు చూపించ కూడదని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ చట్టం, దిశ యాప్ వంటి మహిళా రక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. కుటుంబ వ్యవస్థలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. 2015, 2016, 2017 సివిల్స్ పరీక్షలలో మహిళలు అగ్రస్థానంలో నిలిచి ఉన్నత ర్యాంకులను సాధించారన్నారు. కుటుంబం నుండే మహిళల పట్ల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అన్నారు.

సబ్ కలెక్టర్ వి.అభిషేక్ మాట్లాడుతూ, మహిళలను మానసికంగా వేధించడం, అవమానకరంగా మాట్ల డటం, దాడి చేయడం నేరమని చెప్పారు. మహిళలపై హింసలను నిరోధించాలన్నారు. అనంతరం కాఫీ హౌస్ నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ పీడీఎన్.సూర్యలక్ష్మి, డిఎంహెచ్ఒ జమీల్ భాషా, ఎడిఎంహెచ్ఒ లీలాప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అడ్వకేట్ రాజేశ్వరి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి పాల్గొన్నారు.

రంపచోడవరం : మహిళల రక్షణ సమాజం బాధ్యత అని, వారిపై జరిగే అత్యాచారాలను నిర్మూలనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే అన్నారు. ప్రపంచ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం డిఆర్‌డిఎ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణం వద్ద పిఒ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్షణ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసిందన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వివక్ష, లైంగిక దాడులు, గృహహింసను అరికట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. పాఠశాలలో విద్యతో పాటు ఆత్మ రక్షణ పద్ధతులు నేర్పించాలన్నారు.

ఈ నెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు లింగ వివక్షకు, డిసెంబర్ 2 నుండి 8వ తేదీ వరకు బాల్య వివాహాలకు, 9 నుండి 15వ తేదీ వరకు లైంగిక నేరాలకు, 16 నుండి డిసెంబర్ 23వ తేదీ వరకు గృహహింసకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ ఐటిడిఎ నుంచి దేవీపట్నం సెంటర్ వరకు నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, సిడిపిఒ సంధ్యారాణి, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, డిపిఎం అపర్ణ, యాంకర్ పర్సన్ రామరాజు, ఎపీఎం అప్పారావు, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, వెలుగు, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ధైర్యం అవసరం



ఎస్ఐ నీలిమను సత్కరిస్తున్న కాలేజీ అధ్యాపకులు

ప్రజాశక్తి - ములగాడ: మహిళలు తమను తాము రక్షించుకోవడానికి ముందు ధైర్యంగా ఉండాలని, అవసరమైనప్పుడు పోలీసులను ఆశ్రయించాలని 'దిశపోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.నీలిమ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల 'లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీ' ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, ప్రతి మహిళ రక్షణకు, భద్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. కుటుంబంలో గానీ, పనిచేసే ప్రదేశంలో గానీ, విద్యాలయాల్లో గాని లైంగిక వేధింపులకు గురైతే, వారు తగిన రీతిన స్పందించాలని అన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించిన సదస్సులో కమిటీ కన్వీనర్ ఎ.రోజా, కోఆర్డినేటర్లు వై.అనసూయా దేవి, కె.ఉమామహేశ్వరి, అధ్యాపకులు, మహిళా పోలీసులు ఉమ, మహేశ్వరి, అనురాధ పాల్గొన్నారు. ఎస్ఐ కె. నీలిమను ఘనంగా సత్కరించారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం: విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలైన ఏజిల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో హాస్పిటల్, కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 26 శనివారం ఉదయం 10 గంటలకు కంచరపాలెంజిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి (క్లరికల్) సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్స్ 25 ఖాళీల కొరకు పదవ తరగతి అర్హత కలిగి, 40ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు.ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుండి రూ.15 వేలు జీతం ఉంటుందన్నారు. ఎసిస్మెంట్ మేనేజర్స్ ఉద్యోగాలు, రెండు ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 40ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి నెలకురూ.20 వేలు జీతం ఉంటుందన్నారు

అపోలో హస్పటల్ సంస్థలో సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ ఉద్యోగాలు 15 ఖాళీల భర్తీకి ఎంబిఎ విద్యార్హతతో మూడేళ్ల అనుభవం కలిగిన 45ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులని, అనుభవం బట్టి జీతం ఉంటుందన్నారు. అలాగే కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో ఇండస్ట్రియల్ మెకానికల్ మెయింటినెన్స్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ ఆపరేటర్ ఉద్యోగాలకు 85 ఖాళీల భర్తీకి డిప్లమో, ఐటిఐ అర్హత కలిగిన 23-30ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.12వేలు నుంచి రూ.20వేలు జీతం ఉంటుందన్నారు. సువర్ణభూమి(గాజువాక) సంస్థలో మేనేజర్స్ ఉద్యోగాలు 10 ఖాళీలకు డిగ్రీ, బీటెక్, ఎంబిఎ అర్హత కలిగి 36 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.17వేలు జీతం ఉంటుందన్నారు టెలికాలర్స్ ఉద్యోగాలు 10 ఖాళీలకు పదవ తరగతి, ఇంటర్ అర్హత కలిగిన అభ్యర్థులకు నెలకు రూ.9వేలు జీతం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

యథాతథమేనా...!

గత జెడ్‌పి సర్వసభ్య సమావేశాల్లో చర్చకు రాని ప్రజా సమస్యలు
తెచ్చినా పరిష్కారంకాని వైనం
కెజిహెచ్‌లో పోస్టు మార్టంకు ఆగని డబ్బుల వసూళ్లు
నేడు 2023-24 అంచనా బడ్జెట్
తగ్గనున్న రూ.173 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు విశాఖలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజల ప్రధాన సమస్యలపై చర్చకు వేదికైన ఈ సమావేశాన్ని కొద్ది కాలంగా యాంత్రికంగా నిర్వహిస్తున్నారు. జిల్లా అభివృద్ధి అంశాలపై ఏకాభిప్రాయానికొచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఆలోచన ఏ కోశానా సభ్యులకు కనిపించడంలేదు. కొంతమంది సభ్యులు ప్రస్తావించిన విషయాలు ప్రాధాన్యత సంతరించుకున్నవైనప్పటికీ, రాజకీయంగా చర్చకు అవకాశంలేకుండా మరుగునపడేలా చేస్తున్నారు. సమావేశంలో అధికార బలం చూపడం తప్ప సభ్యులు లేవనెత్తిన ప్రజల సమస్యలను వినడానికి వారికి కనీస సమయం ఇవ్వని పరిస్థితివుంది. మండల స్థాయిలో పరిష్కారంకాని, ఎన్ని విజ్ఞప్తులు, విన్నపాలు చేసినా పరిష్కారానికి నోచని అంశాలను జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించే ప్రయత్నం కొంతమంది సభ్యులు చేస్తున్నా, వారికి అవకాశంలేకుండా కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు చేస్తున్నారు. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయాలను, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ఎమ్మెల్యేలు జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించి అధిక సమయాన్ని తీసుకుంటున్నారు. తరగతుల విలీనం, ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్తుండటంపై ఆగస్టు 30న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తరగతుల విలీనం కాకుండా తీర్మానం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం సమావేశం చేయలేదు.

నాడు-నేడు రెండో దశ పాఠశాల నిర్మాణాలు నిధుల్లేక పూర్తికాలేదు. ప్రాథమిక, సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలన్నీ జరగని పరిస్థితి కొనసాగుతోంది. కెజిహెచ్‌లో పోస్టుమార్టం చేసేందుకు డబ్బులు వసూళ్లపై ఎఎంసి ప్రిన్సిపాల్‌తో విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున చెప్పినప్పటికీ, బాధిత కుటుంబాల నుంచి డబ్బులు వసూళ్లు యథాతథంగానే జరుగుతున్నాయి. బాధితులకు ఆ క్షోభ నుంచి విముక్తి లభించలేదు. భూముల రీ సర్వే ఆశించిన స్థాయిలో ముందుకుసాగడంలేదు. భూ ఆక్రమణలు, అక్రమ క్వారీ తవ్వకాలు ఆగడంలేదు. ఆక్రమణలు నియంత్రించేలా తగిన చర్యలు ప్రభుత్వం యంత్రాంగం చేపట్టకపోవడంతో నగర, అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కొనసాగుతూనేవున్నాయి. ప్రధాన ప్రజా సమస్యలపై సభ్యులు లోతైన చర్చ చేస్తారో, మధ్యాహ్న భోజన సమయానికి తగినట్లు అజెండా అంశాలు నడిపి ముగిస్తారో వేచిచూడాలి.

నేడు 2023-24 అంచనా బడ్జెట్

2023-24 జిల్లా పరిషత్ అంచనా బడ్జెట్ వచ్చే ఏడాది జనవరి 15 నాటికి ప్రభుత్వానికి సమర్పించాల్సివున్నందున 2022-23 సవరణ, 2023-24 అంచనా బడ్జెట్‌ను సమావేశ ఆమోదం కోసం పెట్టనున్నారు. అందుకు ముందుగా ఒకటో స్థాయీ సంఘం ఆమోదం తీసుకొని, తరువాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదానికి ఛైర్‌పర్సన్ సుభద్ర పెట్టనున్నారు.

2022-23లో సవరణ బడ్జెట్‌లో జిల్లా పరిషత్ సాధారణ నిధుల ఆదాయం రూ.47.29 కోట్లు, వ్యయం రూ.44.40 కోట్లుగా చూపించారు. 2023-24 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.50.77 కోట్లు, వ్యయం రూ.49.90 కోట్లు చూపారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు, ఇంజినీరింగ్ శాఖలు, ఇతర ప్రభుత్వ శాఖల నిధులతో కలిపి 2022-23 సవరించిన బడ్జెట్ ప్రకారం జిల్లా పరిషత్ ఆదాయం రూ.1155.23 కోట్లుకాగా, ఖర్చు రూ.1143.21 కోట్లు, 2023-24 అంచనా బడ్జెట్‌లో ఆదాయం 982.88 కోట్లు, వ్యయం రూ.980.93 కోట్లు చూపారు. ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చే ఆదాయం రూ.173 కోట్లు తగ్గుతుందని అంచనా వేశారు.

ముంపు జాబితాలో చేర్చాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని చిడుమూరు గ్రామంలో పోలవరం ముంపునకు గురైతున్న 17 కుటుంబాలను సర్వే చేసి ముంపు జాబితాలో చేర్చాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కుంజా సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం, సురేష్ మాట్లాడుతూ చిడుమురు అంగన్వాడీ -2 సెంటర్ వద్ద ఉన్న 50కుటుంబాలకు 33కుటుంబాలను ముంపు జాబితాలో చేర్చి, 17 కుటుంబాలను పోలవరం నిర్వాసితుల జాబితాలో చర్చకుండా వదిలేయడం దారుణమన్నారు. ప్రతి సంవత్సరం ముంపు పెరిగి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వసితులను మోసం చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో సమస్యలపై ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోడే ముత్తయ్య, శేఖర్, గడ్డల మల్లయ్య, సవలం వినోద్, కన్నయ్య, తులం లాలయ్య, గడ్డల బజార్, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: దేశ భవిష్యత్తుకు యువతే మార్గదర్శకం కావాలని, చిన్న చిన్న ఆనందాలకు ఆకర్షితులై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. సెట్విస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివేకానందుడి చికాగో ప్రసంగం యువతకు ప్రేరణ ఇస్తోందన్నారు. దేశ సంపద యువతే నని చెప్పారు. యువత సత్ మార్గాలవైపు అడుగులు వేయాలన్నారు. చరవాణిల మాయలో పడి కాలాన్ని వృథా చేయకూడదని చెప్పారు. కష్టపడి చదవకండి ఇష్టపడి చదవండి అంటూ హితవు పలికారు. జయాప జయాల కంటే పోటీలలో భాగస్వామ్యం ముఖ్యమన్నారు. జిల్లాలోని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అల్లూరి విశ్వ విద్యాలయంగా ఆవిర్భవించాలని ఆకాంక్షించారు.

పాడేరు ఎంపిపి ఎస్.రత్నకుమారి మాట్లాడుతూ, చదువు అజ్ఞానపు చీకట్లను తొలగించి విజ్ఞానవపు వెలుగులు నింపుతుందన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జానపద నృత్యాలు, వకృత్వపు పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సెట్విస్ సిఇఒ పి.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టిఎన్ రసూల్, ఎన్ఎస్ఎస్ పిఒ గౌరీశంకర్, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- హుకుంపేట: విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు సత్యనారాయణ కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి ప్రజా సంఘాల మీడియా నిషేధమని గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు పాఠశాలలో సందర్శించారు. సంక్షేమ హాస్టల్ పోరుబాట కార్యక్రమంలో బాగంగా మండలంలోని బాకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టి.ఎన్.ఎస్.ఎఫ్ బృందం సందర్శించింది. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు, మౌలిక సదుపాయాలు అందించే విధంగా ఉత్తర్వులు ఎందుకు జారీ చేయకూడదని ప్రశ్నించారు. చలికాలంలో రగ్గులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు గత ప్రభుత్వ హయాంలో సబ్బులు, కొబ్బరి నూనె, పెట్టెలు ఉచితంగా ఇచ్చారన్నారు. మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ అరకు అసెంబ్లీ కార్యదర్శి దార రవి, వంతాల భీమారావు సెక్రటరీ విశ్వనాథం, మోహన్, తెలుగు యువత నేతలు హరి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన ఫార్మశీ వారోత్సవాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఫార్మశీ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభలో ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ పి.రామారావు మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మశీ నిపుణుల పాత్ర కాలానుగుణంగా మారుతోందన్నారు. మందులు పంపిణీ చేసే ఫార్మశీ పాత్ర నుంచి ఆరోగ్య రక్షణ నిర్వహణ నిపుణులుగా ఫార్మసిస్టులు తమ పరిధిని విస్తరించుకుంటున్నారని తెలిపారు. ఔషధాల పరిశోధన, నాణ్యత ప్రమాణాల నిర్ధారణ, వైద్యులకు సహాయపడటం వంటి వివిధ నైపుణ్యాలను ఫార్మశీ రంగం అందిస్తుందన్నారు. ఫార్మశీ వారోత్సవాల భాగంగా వివిధ పోటీలను విజేతలకు బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధుకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దీక్షలు కొనసాగిస్తున్న నిర్వాసితులు

4వ రోజుకు రామవరం నిర్వాసితుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-చింతూరు : పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ముంపునకు గురవుతున్న విఆర్ పురం మండలం రామవరం, రామవరం పాడు గ్రామాల్లోని 104 కుటుంబాలను ముంపు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ చింతూరు ఐటిడిఎ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ముంపు గురవుతున్న 270 కుటుంబాలు ఉండగా, 166 కుటుంబాలను మాత్రమే నిర్వాసిత జాబితా ప్రకటించి, మిగిలిన 104 కుటుంబాలను జాబితాలో చేర్చలేదని తెలిపారు. అందరినీ ముంపు జాబితాలో చేర్చాలని కోరుతూ 104 కుటుంబాలకు చెందిన నిర్వాసితులు ఈ దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు నిర్వాసితుల జాబితా పత్రికల్లో తమను ప్రకటించే వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.



శబరిమల వెళ్లేందుకు సిద్ధమైన అయ్యప్ప భక్తులు

శబరిమల బయలుదేరిన స్వాములు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో అయ్యప్ప స్వామి మాలలు ధరించి ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో 45 రోజులు దీక్షలు చేసిన స్వాములు శుక్రవారం శబరిమల బయలుదేరారు. వీరికి గురు స్వాములు రమేష్, కాశి అయ్యప్ప ఆలయంలో విఘ్నేశ్వరుని ముందు ఇడుములు కట్టారు. అనంతరం స్వాములు ఒడిని ఆరగించి కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆధ్వర్యంలో కాలినడకన రామాలయ ఆలయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక వాహనాలపై శబరిమల బయలుదేరారు.

బాలాజీ లాడ్జి ఆవరణలో పడిపూజ

సీలేరు అయ్యప్ప భక్తుడు బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర్ సతీమణి నాగమణి, బంధుమిత్రులు ఆధ్వర్యంలో లాడ్జి ఆవరణలో శుక్రవారం పడిపూజ నిర్వహించారు. అరటి తెప్పలతో అయ్యప్ప స్వామి ఆలయాన్ని 18 మెట్లుతో ఏర్పాటు చేసి పూలమాలలుతో అలంకరించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి పడిపూజ ముగిసిన అనంతరం భక్తులకు ఓడి ఏర్పాటు చేశారు.

జూనియర్ కళాశాలలో మైదానం సర్వే

ప్రజాశక్తి - అడ్డతీగల : మండల కేంద్రంలోని అనంత చక్రరావు జూనియర్ కాలేజీ మైదాన ప్రాంతం అన్యాక్రాంతమవుతుందని కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం మధ్యాహ్నం నుండి అడ్డతీగల రెవెన్యూ అధికారులు సర్వేయరు గోవిందరాజులు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. దీనిపై పూర్తి నివేదిక రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు గోవిందరాజులు తెలిపారు.